
సాక్షి ఒడిశా

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.49.434లు. బంగారం 150 మిల్లీగ్రాములు. వెండి 15 గ్రాములు800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గిరి సంపదను ప్రభుత్వం దోచుకుంటోంది

రాష్ట్రంలోని బీజేడీ ప్రభుత్వం గిరిజనుల సంపదను దోచుకుంటోందని పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ మండిపడ్డారు.

- 8లో.



స్పందించని ప్రభుత్వం

లక్ష్మీ బస్సు పథకాన్ని వేరొక సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడంపై ప్రైవేటు బస్సు యజమానులు చేసిన బంద్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు.

- 8లో.

## న్యూస్‌రీల్

### సత్తాచాటిన మానస్విని



పోటీలో ప్రతిభ కనబరుస్తున్న మానస్విని

బరంపురం: జాతీయ నౌకాయాన పోటీల్లో గంజాం జిల్లాకి చెందిన మానస్విని మహారాణి సత్తాచాటింది. అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గోవాలో భారత జాతీయ నౌకాయాన ఛాంపియన్ షిప్ పోటీలు గురువారం జరిగాయి. ఈ పోటీలో పసిబందా గ్రామానికి చెందిన మానస్విని స్వర్ణ పతాకం సాధించింది. ఆమె ప్రస్తుతం ఛత్రపూర్‌లోని టాటా స్టీల్ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు.

### కలెక్టర్ కార్యాలయ ఆస్తుల జప్తుకి ఆదేశాలు



కలెక్టరేట్‌లో ఉన్నటువంటి కారు

కొరాపుట్: జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆస్తుల జప్తుకి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2010 సంవత్సరంలో కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి కేంద్రంలో మదన్ కృష్ణ మెడికల్ సెంటర్ నుంచి ప్రభుత్వం రూ.2,23,000ల మందులను కొనుగోలు చేసింది. ఆ డబ్బులు చెల్లించకపోవడంతో యజమాని హరికృష్ణ మహంతి కోర్టుని ఆశ్రయించాడు. కోర్టు వడ్డీతో సహా రూ.4,39,000లను చెల్లించాలని 2018 సంవత్సరంలో తీర్పు వెలువరించింది. అయితే ఆదేశాలు అమలు కాకపోవడంతో బాధితుడు మరోసారి కోర్టుని ఆశ్రయించాడు. దీంతో కొరాపుట్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు తుది తీర్పు ఆదేశాలు వెలువరించింది. బాధితుడికి పరిహారం చెల్లించడంలో కోర్టు ఆదేశాలు పట్టించుకోనందున ఆగ్రహం వ్యక్తం చేసింది. కొరాపుట్ జిల్లా కలెక్టర్ కారు, 10 టేబుల్స్, ఫ్యాన్లు, ఏసీ యంత్రాలు జప్తు చేయాలని ఆదేశించింది. వెంటనే ప్రభుత్వ న్యాయవాది మాట్లాడుతూ.. ఆదేశాల అమలు ఆలస్యంపై విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని కోరారు. దీంతో ప్రభుత్వం మరికొంత సమయం ఇచ్చింది.

### అదుపుతప్పి లోయలోకి ట్రక్కు



లోయలోకి దూసుకెళ్లిన ట్రక్కు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమీపంలోని పెట్టా ఘాట్ రోడ్డుపై ఒక ట్రక్కు అదుపుతప్పి లోయలోకి జారిపడింది. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యలమంచిలి నుంచి సిమెంట్ లోడ్‌తో ఒక ట్రక్కు గురువారం ఉదయం మల్కన్‌గిరి వస్తోంది. ఆ సమయంలో పెట్ట ఘాట్ రోడ్డులో బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో 30 అడుగుల లోయలోకి జారిపడింది. ట్రక్కు గ్లాసు విరిగిపోవటంతో డ్రైవర్ స్వల్ప గాయలతో చాకచక్యంగా బయటపడ్డాడు. ప్రమాదంపై స్థానికులు మాట్లాడుతూ.. ఘాట్ రోడ్డుకి ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ గోడ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# పారిశ్రామిక హబ్‌గా ఒడిశా

- అదే లక్ష్యంతో పనిచేస్తున్నాం
- ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ఒడిశాను తూర్పు పారిశ్రామిక హబ్‌గా మార్చడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. రాయగడ జిల్లా కన్సారిగూడలో ఉన్న ప్రాజెక్ట్‌కు దీర్ఘకాలిక ముడిసరుకు అనుసంధానం కోసం హిండాల్కో ఇండస్ట్రీస్‌తో ఒడిశా మైనింగ్ శాఖ అవగాహన ఒప్పందాన్ని గురువారం కుదుర్చుకుంది. ఒప్పందంపై ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బల్వంత్ సింగ్, హిందాల్కో మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ పాయ్‌లు సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాయగడలో 2 మిలియన్ టన్నుల అల్యూమినా రిఫైనరీకి సంబంధించిన పనులు సులభతరమై వేగవంతమవుతాయి. ఒడిశాలో పెట్టుబడులకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. వ్యాపారం మరియు సామాజిక, ఆర్థిక వృద్ధి సమష్టి ప్రక్రియగా భవిష్యత్తును అందరూ కలిసి సృష్టించుకోవాలని కోరారు. ఒడిశా పారిశ్రామిక అభివృద్ధి ప్రయాణంలో ఈ ఒప్పందం ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. పారిశ్రామిక పెట్టుబడులకు ఒడిశాను అయస్కాంతంగా మార్చేందుకు అవగాహన ఒప్పందం అచంచలమైన అంకితభావానికి ఉదాహరణ అన్నారు. కన్సారిగూడలోని ఆదిత్య అల్యూమినియం లిమిటెడ్‌కి చెందిన అల్యూమినా రిఫైనరీ రూ.8 వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్ అని వివరించారు.

**ఉపాధి అవకాశాలు**

ఈ ఒప్పందం వలన 1,000 మందికి ప్రత్యక్షంగా, 4,000 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం పేర్కొన్నారు. పారిశ్రామిక రంగం పరివర్తన శక్తిగా పేర్కొంటూ, ఒడిశా సామర్థ్యాన్ని విశ్వసించి, ఈ ప్రయాణంలో రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామి అయినందుకు ఆదిత్య బిర్లా గ్రూప్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉత్తేజకరమైన యాత్రలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రిఫైనరీ ప్రాజెక్టుకు అన్నివిధాలా సహకారం అందించాలని, తద్వారా పనులు త్వరగా ప్రారంభించి స్థానిక ప్రజల జీవితంలో కనిపించే మార్పులు తీసుకురావాలని రాయగడ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దూరదృష్టితో కూడిన నాయకత్వంలో ఒడిశా శరవేగంగా పారిశ్రామికీకరణను సాధిస్తోందని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా అవగాహనా ఒప్పందంపై సంతకాలు పురస్కరించుకుని కొనియాడారు. అనేక దశాబ్దాల అభివృద్ధి ద్వారా, ఒడిశా అనేక రంగాలలో అద్భుతమైన పురోగతిని సాధించిందని ఆయన తెలిపారు.





ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

# సాంకేతికతపై పట్టు సాధించాలి





ప్రారంభోత్సవ వేదికపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తదితరులు

- సీఎం నవీన్ పట్నాయక్
- బీపీయూటీ టెక్ కార్నివాల్-23 ప్రారంభం

భువనేశ్వర్: విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ఐఎంఎంటీ ఆడిటోరియంలో బీపీయూటీ (బిజు పట్నాయక్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ) టెక్ కార్నివాల్-23ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతికత మన భవిష్యత్‌కు ఇరుసు వంటిదని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానం సముపార్జనలో నిమగ్నమై ముందుకు సాగాలని సూచించారు. భవిష్యత్ వృద్ధికి మరియు శ్రేయస్సుకు ఇరుసుగా ఉన్నందున అధునాతన మరియు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను తెలుసుకోవాలన్నారు. ఒడిశా యువత నైపుణ్యాన్ని పెంపొందించడం, వారికి ఉపాధి కల్పించడం మరియు ఒడిశాను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చడంలో రాష్ట్రం గొప్ప పురోగతిని సాధించిందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. సాంకేతిక విద్యారంగంలో బీపీయూటీ అగ్రగామిగా నిలిచి రాష్ట్ర, దేశ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిందన్నారు. సాంకేతిక, సాంస్కృతిక మరియు క్రీడా కార్యకలాపాలలో విద్యార్థులను నిమగ్నం చేయడానికి బీపీయూటీ టెక్ కార్నివాల్ – 2023 రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థుల కృషి, చిత్తశుద్ధి, అంకితభావాన్ని గుర్తించి మెచ్చుకునేలా ఈ కార్నివాల్ క్యాలెండర్ ఈవెంట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వెబ్ పోర్టల్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఒడిశా ఇప్పుడు సాంకేతిక విద్యకు కేంద్రంగా మారిందని రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి మరియు సాంకేతిక విద్యా విభాగం మంత్రి ప్రీతిరంజన్ ఘొడై అన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి మరియు సాంకేతిక విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉషా పాఢి, ముఖ్యమంత్రి (5-టీ) సెక్రటరీ వి.కె.పాండియన్, బీపీయూటీ వైస్ ఛాన్సలర్ అమియా కుమార్ రొథొ తదితరులు పాల్గొన్నారు.

# సిక్కిం వరదల్లో వీర జవాన్ మృతి

- ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాపం
- నేడు స్వగ్రామానికి జవాన్ సరోజ్ దాస్ పార్థివదేహం



సరోజ్ కుమార్ దాస్(ఫైల్)

భువనేశ్వర్: సిక్కింలో సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతైన 23 మంది సైనికుల్లో ఒడిశాకు చెందిన ఆర్మీ జవాన్ సరోజ్ కుమార్ దాస్ ఉన్నారు. అయన వరదల్లో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విధి నిర్వహణలో తలమునకలై ఉండగా వరదలో గల్లంతైన దాస్ మృతదేహం గురువారం లభ్యమైంది. కుటుంబ సభ్యులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అతడిని గుర్తించారు. చివరిసారిగా మంగళవారం రాత్రి 10 గంటలకు సరోజ్ దాస్ తన సోదరుడు మనోజ్‌తో ఫోన్‌లో మాట్లాడాడని వాపోయాడు. భారీ వర్షం కురుస్తోందని, శిక్షణా శిబిరం నుంచి యూనిట్‌కు తిరిగి వస్తున్నానని సోదరుడికి చెప్పాడు. అనంతరం ఐదుగురు జవాన్ల మృతదేహాల ఫొటోలను ఆర్మీ అధికారులు కుటుంబ సభ్యులకు పంపారు. వారిలో తన సోదరుడు మృతదేహం ఉన్నట్లు గుర్తించామని మనోజ్ వెల్లడించారు. కొన్ని గంటల తర్వాత తుది నిర్ధారణ నివేదికను పంపుతామని ఆర్మీ అధికారులు తెలిపారన్నారు. సరోజ్ కుమార్ దాస్‌కు ఏడు నెలల క్రితం వివాహమైంది.

**కలెక్టర్ పరామర్శ**

ఢెంకనాల్ జిల్లా కలెక్టర్ సరోజ్ కుమార్ సెఠి జవాన్ కుటుంబ సభ్యులను జవాన్ స్వగ్రామం కెందుడిప్పాలో పరామర్శించారు. సరోజ్ దాస్ మృతదేహం శుక్రవారం గ్రామానికి చేరుకోనుంది. పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కుటుంబానికి ఆర్థిక సాయం వేగవంతంగా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. సరోజ్ సైన్యంలో 2012 సంవత్సరంలో హవల్దార్‌గా చేరాడు. అతను భారత సైన్యం కార్ప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్ (ఈఎంఈ) విభాగంలో భర్తీ అయ్యాడు.

**సీఎం దిగ్భ్రాంతి**

సిక్కిం వరదల్లో ఒడియా జవాన్ సరోజ్ కుమార్ దాస్ మృతి చెందడంపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సరోజ్ కుమార్ మరణం బాధ కలిగించిందన్నారు. దేశ సేవలో ఆయన చేసిన త్యాగం ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలియజేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు సంతాప సందేశంలో ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పర్లాకిమిడి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సెంచూరియన్ వర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థుల పేర్కొన్నారు. ఈ మేరకు గుసాని సమితి ఉప్పలాడ గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటే కార్యక్రమం గురువారం చేపట్టారు. కార్యక్రమంలో వర్షిత్ వర్ధన్, వినయ్, వి.వినోద్ కుమార్, జస్వంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు




ప్రమాద స్థలంలో ఉన్న లారీ



గాయాలతో చికిత్స పొందుతున్న ఆకాష్

రాయగడ: స్థానిక ఎస్‌బీఐ కూడలిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకాష్ కుమార్ బెహర (16) అనే విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. తొమ్మిదో తరగతి చదువుతున్న ఆకాష్ సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో కూడలిలో ఎదురుగా వస్తున్న ఒక లారీ ఢీకొంది. దీంతో విద్యార్థి కాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. తీవ్రగాయాలకు గురైన ఆ బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆకాష్ తల్లి రీనా ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## • సైకత శుభాకాంక్షలు





ఆసియా క్రీడల్లో స్వర్ణ, రజత పతకాలు సాధించి నీరజ్ చోప్రా, కిషోర్ కుమార్ జెనాలు దేశ కీర్తిని చాటారు. వీరు జావెలిన్ త్రో పోటీలో స్వర్ణం (నీరజ్ చోప్రా), రజతం (కిషోర్ కుమార్ జెనా) సాధించారు. దీంతో వారికి అంతర్జాతీయ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ సైకత శిల్పంతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో పూరీ సాగర తీరంలో అపురూప సైకత కళాఖండం ఆవిష్కరించారు.

– భువనేశ్వర్

# తవ్వకాలకు ప్రజల ఆమోదం

- మద్దతుగా కాసీపూర్‌లో భారీ ర్యాలీ
- ప్రారంభించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత





బాక్సైట్ తవ్వకాలు చేపట్టాలని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో ఉన్నటువంటి సిజిమాలి ప్రాంతంలో బాక్సైట్ గనుల తవ్వకాలు ప్రారంభించడంలో తమకు ఎటువంటి అభ్యంతరాలు లేవని జిల్లాలోని కాసీపూర్, కలహండి జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం కాసీపూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. కాసీపూర్ సమితిలోని పొరొజాసెల, కుమార్‌సెల, రొధొజొడి, మైకంచ్, జిరిజోల్, ఉపొరొజొలి, పడికాల సుంగేరుచ కంటామాల్, బొండేల్, సింధూరఘాటి, సరంబటి, బొంతేసు అలాగే కలహండి జిల్లా తువామూల్ రాంపూర్ జిల్లాలోని దొలంపదర్, నాక్‌ముండి, చెరపాయి, సిలేరు తదితర గ్రామాలకు చెందిన సుమారు 25 వేల మంది ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. కాసీపూర్ సమితి కార్యాలయం నుంచి కొంతమంది, రాయగడ నుంచి కాసీపూర్‌కు వెళ్లే రహదారి వద్ద మరికొంత మంది రెండు వర్గాలుగా ర్యాలీని నిర్వహించి, కాసీపూర్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. ర్యాలీకి నేతృత్వం వహించిన శరత్ చంద్ర గౌడొ, దయానిధి భొయ్‌లు ఈ మేరకు అదనపు తహసీల్దార్ కృష్ణచంద్ర గొరాడియాకు, అదేవిధంగా కాసీపూర్ ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్‌లకు తవ్వకాలకు ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రాలను అందించారు.

**వలసలు తగ్గాలని**

కాసీపూర్ వంటి ప్రాంతంలో ఎంతోమంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాల కోసం వలస వెళ్తున్నారని, అదే ఇక్కడి ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకుంటే వలసలు నివారించవచ్చని శరత్‌చంద్ర గౌడొ అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతోనే ప్రగతి సాధ్యమవుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఖనిజ నిక్షేపాలకు నిలయంగా మారిన కాసీపూర్‌లో పరిశ్రమలు ఏర్పడితే ప్రజలు అభివృద్ధి చెందుతారని కలహండి జిల్లాకు చెందిన దయానిధి భొయ్ అన్నారు. తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇస్తే, కొంతమంది ప్రజలను తప్పుదోవ పట్టించడంతో జాప్యం చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలనే రెండు జిల్లాల్లోని బాధిత గ్రామాల ప్రజలు సమైఖ్యతగా ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ తీసుకుని త్వరితగతిన గనుల తవ్వకాలను ప్రారంభించాలని కోరారు.

**పోలీసు బందోబస్తు**

కాసీపూర్‌లో గురువారం నిర్వహించిన భారీ ర్యాలీలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ మేరకు 6 ప్లాటూన్ల పోలీస్ బలగాలను మోహరించింది. ర్యాలీ జరిగే ప్రాంతం, ప్రధాన కూడళ్లలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్పీ వివేకానంద శర్మ పరిస్థితిని సమీక్షించారు.

**16న ప్రజాభిప్రాయ సేకరణ**

కాసీపూర్‌లోని సిజిమాలిలో బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి ప్రజల అభ్యంతరాలు, అభిప్రాయాలను సేకరించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీనికోసం ఈనెల 16వ తేదీన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రజాభిప్రాయ సేకరణలో సుముఖత వ్యక్తమయితే ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తవ్వకాలకు శ్రీకారం చుట్టేందుకు యంత్రాంగం చర్యలు తీసుకోనున్నట్లు భోగట్టా.



అదనపు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు



మాట్లాడుతున్న భొయ్



భారీగా మోహరించిన పోలీసు బలగాలు

## క్లుప్తంగా

### నూతన బస్టాండ్ ప్రారంభం



నూతన బస్టాండ్ ప్రారంభిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు వద్ద నూతన బస్టాండ్‌ను జిల్లా బీజేడీ అధ్యక్షుడు మానాస్ మాడ్కమి బుధవారం ప్రారంభించారు. ఈ మోటూ ప్రాంతం నుంచి ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు ముఖ్య రహదారులు ఉన్నాయి. ఇదివరకు ఈ ప్రాంతంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇప్పుడు నూతనంగా నిర్మించడంతో కష్టాలు తీరుతాయని అంటున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గాప్రసాద్, గిరిజన అభివృద్ధి శాఖ ప్రెసిడెంట్ అడ్మార్వా, జిల్లా అదనపు కలెక్టర్ వెద్బర్ ప్రధాన్, ప్రైవేట్ బస్సు యాజమాన్య సంఘ అధ్యక్షురాలు రాజేశ్వరీ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

కంచిలి: కంచిలి ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కరని శ్రీరామమూర్తి(48) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన గురుకులంలో పనిచేస్తూ, ప్రతి రోజు కంచిలి హైవేలో ఉన్న పబ్జి దాబాలో సాయంత్రం టిఫిన్ తినడానికి వెళ్తుంటారు. ఎప్పటిలాగే తన స్కూటీలో బుధవారం సాయంత్రం చీకటి పడిన తర్వాత హోటల్‌కు వెళ్లారు. దారిలో వాహనం అదుపు తప్పడంతో ఆయన రోడ్డు మీద పడిపోయారు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్‌లో సోంపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈయన స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామం. ఈయన కుటుంబం ప్రస్తుతం శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే హుటాహుటిన కంచిలి వచ్చారు. మృతుని భార్య సరిత ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ ఎస్. బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం తెలిపారు.

### ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



పవన్ కల్యాణ్ (ఫైల్)

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూప్‌లో చదువుతున్న బాడాపు పవన్‌కల్యాణ్ (16) బుధవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం అలమాజీపేట గ్రామానికి చెందిన బి.సూర్యనారాయణ కుటుంబంతో ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేట సమీపంలో నివాసం ఉంటున్నారు. ఆయన వంటలు చేసేందుకు వెళ్తుంటారు. పవన్ కల్యాణ్ ఆమదాలవలస పట్టణంలో జరిగిన వినాయక చవితి నిమజ్జన ఉత్సవాల్లో కాసేపు పాల్గొని ఇంటికి వెళ్లాడు. మళ్లీ తిరిగి ఉత్సవాల్లో డ్యాన్స్‌లు చేసేందుకు వెళ్తానని తన తల్లి దమయంతి అడిగాడని ఆమె డ్యాన్స్‌లకు వెళ్లకుండా చదువుకోమని మందలించిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విద్యార్థికి డ్యాన్స్ అంటే ఇష్టం, అయితే తల్లి చదువుకోవాలని చెప్పేవారు. ఎప్పటిలాగే తల్లి మందలించగా విద్యార్థి చిన్న మనసు చేసుకొని ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికుల కథనం. విద్యార్థి తండ్రి బుధవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో బయట నుంచి వచ్చి చూసేసరికి కుమారుడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. దీనిపై ఎలాంటి కేసు నమోదు అవలేదని పోలీసులు తెలిపారు. విద్యార్థి మృతి విషయం తెలిసి జీజే కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం ప్రకటించారు.

### చెరువులో పడి వ్యక్తి మృతి



కామరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్

పాతపట్నం: మండలంలోని సింగుపురం గ్రామానికి ఆనుకొని ఉన్న పెద్ద చెరువులో కాకినాడ జిల్లా కిల్లంపూడి గ్రామానికి చెందిన యనమల కామరాజు(36) పడి గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా, కిల్లంపూడి గ్రామానికి చెందిన యనమల కామరాజు 20 రోజుల కిందట తోటి గ్రామస్తులతో, సింగుపురం గ్రామంలో నూతనంగా శివాలయం నిర్మాణానికి వచ్చారు. వారితో ప్రతి రోజూ శివాలయం పనులు చేసుకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీన చెరువుకు బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. ఆ రాత్రి కామరాజు రాకపోవడంతో తోటి పనివాళ్లు వెతకటం ప్రారంభించారు. స్థానికులు చెరువులో మృతదేహాన్ని చూసి అది కామరాజుదేనని గుర్తు పట్టి పోలీసులకు, కుటుంబసభ్యులకు విషయాన్ని తెలియజేశారు. ఎస్‌ఐ, పోలీసులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహానికి పాతపట్నం సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

# గిరి సంపదను ప్రభుత్వం దోచుకుంటోంది

- గిరిజనులకు పథకాలు అందడం లేదు
- పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్



మల్కన్‌గిరి: ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



మల్కన్‌గిరి: అభిమానులకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్కన్‌గిరి: రాష్ట్రంలోని బీజేడీ ప్రభుత్వం గిరిజనుల సంపదను దోచుకుంటోందని పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ మండిపడ్డారు. స్థానిక డీఎన్‌కే మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరత్ పట్నాయక్ మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా ప్రభుత్వంలో ఉన్నటువంటి బీజేడీ గిరిజనుల పార్టీ అంటూనే గిరిజనులను దోచుకోవడం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తోందని దుమ్మెత్తిపోశారు. గిరిజనులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖనిజ మరియు అడవి సంపదను దోచుకోవడం కోసం వీలుపడే చోట్ల మాత్రమే అభివృద్ధి పేరుతో రహదారులు నిర్మిస్తున్నారన్నారు. కంపెనీలను నిర్మించడం కోసం గిరిజనులను సొంత భూమిని వదిలి వెళ్లిపోమని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ సెల్ కో-ఆర్డినేటర్ కె.రాజు, శివాజీరావు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ చైర్మన్ రాజేష్ లిలటియా, ఛత్తీష్‌ఘడ్ కేబినేట్ మంత్రి లఖ్మ కావాసి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ భుజాబాల్ మాఝి, బంకోనిధి బెహర, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బహిణీపతి, కోంటబంజి ఎమ్మెల్యే సంతోష్ సింగ్, నవరంగ్‌పూర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మున్నా త్రిపాఠి, మల్కన్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవిందపాత్రో, జి.శ్రీనివాస్‌రావు, కలమెల సమితి అధ్యక్షుడు మాల మాడీ, మల్కన్‌గిరి కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే నిమాయి సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

**పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం**

బరంపురం: నగరానికి బుధవారం సాయంత్రం విచ్చేసిన ఒడిశా కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్‌కు ఘన స్వాగతం లభించింది. పార్టీ సమావేశం నిమిత్తం ఆయన బరంపురం మీదుగా కొరాపుట్‌కి వెళ్తుండగా జిల్లా కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పితవాసి పండా, రాష్ట్ర యువజన నాయకుడు చిన్మాయి హత్తా, పీసీసీ కార్యదర్శి ప్రమోద్ కుమార్ జెనా, జిల్లా యువజన నాయకుడు బిశ్వజిత్ పాత్రో, బరంపురం లోక్‌సభ మండలి అధ్యక్షుడు అనిల్ పొరిడా పాల్గొన్నారు.

జయపురం: మల్కన్‌గిరిలో సమావేశం నిమిత్తం జయపురం మీదుగా వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. వందలాది మంది కార్యకర్తలు ద్విచక్ర వాహనాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్



మల్కన్‌గిరి: సమావేశానికి హాజరైన గిరిజనులు



బరంపురం: శరత్ పట్నాయక్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు



జయపురం: ద్విచక్ర వాహనాల ర్యాలీతో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

# విద్యార్థి సంఘం ఎన్నికల రద్దు

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

భువనేశ్వర్: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు మరియు విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘం ఎన్నికలను రద్దు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒడిశా హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.షడంగి, జస్టిస్ మురహరి శ్రీరామ్‌లతో కూడిన ధర్మాసనం ఒక వారంలోగా సమాధానాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్య, సామూహిక విద్యాశాఖ కార్యదర్శులు మరియు ఉన్నత విద్యా శాఖ సంచాలకులను ఆదేశించింది. జె.ఎం. లింగ్డో కమిషన్ సిఫార్సులను సుప్రీంకోర్టు ఆమోదించి, వాటిని అమలు చేయాలని ఆదేశించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా వర్సిటీలు, కళాశాలల్లో ఎన్నికలు నిర్వహించడంలో విఫలమైందని పిటిషనర్ వర్గం ఏబీవీపీ తరపు న్యాయవాది తెలిపారు. విద్యార్థుల ప్రాతినిధ్య సంస్థలకు విద్యార్థుల నియామకం కోసం దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలలు సాధారణంగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన నిబంధనలను జారీ చేసినట్లు గుర్తు చేశారు.

**నోటిఫికేషన్ జారీ చేయాలని అభ్యర్థన**

2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మరియు ప్రభుత్వ, ప్రభుత్వేతర ఎయిడెడ్ కళాశాలల్లో విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన నోటిఫికేషన్ జారీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని హైకోర్టుకు అభ్యర్థించారు. 2019 సంవత్సరం నుంచి విద్యార్థి సంఘం ఎన్నికలను వరుసగా రద్దు చేస్తున్నారన్నారు. ఈ చర్య విద్యార్థుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా ఏబీవీపీ వర్గం పేర్కొంది. విద్యార్థి సంఘం ప్రయోజనాల దృష్ట్యా ఎన్నికల రద్దుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఏకపక్షం మరియు అహేతుకమని వివరించింది. గత నెలలో ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలల క్యాలెండర్‌లో ఎన్నికల గురించి ఏమీ ప్రస్తావించలేదన్నారు. సాధారణంగా దుర్గాపూజ సెలవులకు ముందు ఎన్నికలు జరుగుతాయి. ఈ విద్యా సంవత్సరంలో అక్టోబర్ 21 నుంచి 28 వరకు సెలవులు ప్రకటించారు. కానీ అంతకుముందు నిర్వహించాల్సిన విద్యార్థి సంఘాల ఎన్నికలకు తేదీని ఈ క్యాలెండరులో పేర్కొనలేదని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) మరియు పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) రెండింటికీ మిడ్-సెమిస్టర్ పరీక్షలు అక్టోబర్ చివరి వారం నుంచి షెడ్యూల్ చేసినట్లు తెలిపారు.

### 8న జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు ఈనెల 8వ తేదీన జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు తెలిపారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలు వుతుందని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు 18 ఏళ్లలోపు వయస్సు కలిగి 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండా లని స్పష్టం చేశారు. క్రీడాకారుల వయస్సు, బరువు, ఎత్తు ఇండెంట్ ప్రకారం 250లోపు పాయింట్లను కలిగి ఉండాలని వారు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను చిత్తూరు జిల్లాలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల ఖోఖో చాంపియన్‌షిప్ -2023 పోటీలకు పంపిస్తామని నాగభూషణం, ఫల్గుణరావు చెప్పారు. ఆసక్తి అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో టెక్కలి జీడీసీ మైదానం వద్దకు హాజరై జిల్లా ఖోఖో సంఘ కోశాధికారి, ఫిజికల్ డైరెక్టర్ బాడాన నారాయణరావు (8500007272)ను సంప్రదించాలని వారు కోరారు.

### ఒంటరి మహిళపై లైంగికదాడి

గార: మండలంలోని కొర్ని గ్రామానికి చెందిన ఒంటరి మహిళపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడినట్లు గార ఎస్‌ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఆ మహిళపై ఆటో డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. దీనిపై బాధితులకు పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఆ మేరకు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

# స్పందించని ప్రభుత్వం



మాట్లాడుతున్న నరేంద్ర మహంతి తదితరులు

- ఈనెల 10న మరోసారి ప్రైవేట్ బస్సుల బంద్

జయపురం: లక్ష్మీ బస్సు పథకాన్ని వేరొక సంస్థకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ అవిభక్త కొరాపుట్ ప్రైవేటు బస్సు యజమానుల సంఘం ఈనెల 2వ తేదీన 24 గంటల పాటు ప్రైవేటు బస్సులు బంద్ చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రైవేట్ బస్సు యజమానుల డిమాండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లను వెంటనే ఆమోదించకపోతే ఈనెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ బస్సులను బందు చేస్తామని అవిభక్త కొరాపుట్ జిల్లా ప్రైవేట్ బస్సు యజమాన సంఘం హెచ్చరించింది. ఈ మేరకు సంఘం కార్యాలయంలో ఆ సంఘ నేత, జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి సహకరించేందుకు ప్రైవేట్ బస్సు యజమానులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటున్నారని గుర్తు చేశారు. అందువలన ప్రభుత్వం సైతం తమకు సహకరించాలని కోరారు. ఇతర రాష్ట్ర కంపెనీతో ఏ ఒప్పందం కుదుర్చుకుందో, ఆ ఒప్పందం రాష్ట్ర ప్రైవేట్ బస్సు యజమానులతో కుదుర్చుకోవాలని సూచించారు. దీనివలన ప్రభుత్వానికి, ప్రైవేటు బస్సు యజమానులకు ఆదాయం వస్తుందని తెలియజేశారు. తాము లక్ష్మీ బస్సు పథకానికి వ్యతిరేకం కాదని, పథకం అమలుపై ప్రభుత్వ నిర్ణయానికి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రైవేట్ బస్సు యజమానులు బసంతకుమార్ బిశ్వాల్, రామచంద్ర పాడీ, బన త్రిపాఠీ, టున పాణిగ్రహి, అశోక్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

### సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్య కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్ల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల (సర్టిఫికెట్ల) పరిశీలన ప్రక్రియ ముగిసింది. వీఐ/హెచ్‌ఐ, ఎంఆర్ ఈ రెండు కేటగిరీల పోస్టులకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా 172 మంది దరఖాస్తులు చేసుకోగా.. సర్టిఫికెట్ల పరిశీలనకు 143 మంది హాజరయ్యారు. హాజరైనవారిలో ఆరుగురు అభ్యర్థులను ఈ పోస్టులకు దరఖాస్తు చేసేందుకు అనర్హులుగా గుర్తించారు. దీంతో మిగిలిన 137 మంది అర్హులైన అభ్యర్థుల డేటాను కేటాయించిన మార్కులు, రోస్టర్ ప్రాతిపదికన మెరిట్‌లిస్టును తయారుచేశారు. మొత్తం 17 పోస్టులు ఉన్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన సహిత విద్య కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్ల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం సిద్ధంచేసిన మెరిట్‌లిస్టును సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ కార్యాలయానికి చేరవేసినట్టు సమగ్రశిక్షజిల్లా ప్రాజెక్ట్ ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో తెలియజేశారు. వెబ్‌పోర్టల్‌లో వెల్లడించిన జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ కూడా చేపడతామని తెలిపారు.

# నకిలీ వస్తువులు చూపి బంగారం చోరీ



సీసీ పుటేజీలో అనుమానిత మహిళలు

నరసన్నపేట: స్థానిక స్వర్ణా ప్యాలెస్ బంగారం షాపులో గుర్తు తెలియని ఇద్దరు మహిళలు సినీ ఫక్కీలో షాపు నిర్వాహకులకు టోపీ వేసి 73 గ్రాముల బంగారు ఆభరణాలను కాజేశారు. ఈ మేరకు షాపు యజయాని బుధవారం నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 30న పుసుపులేటి గౌరీ అనే మహిళ మరో వ్యక్తితో కలసి వచ్చి కొన్ని బంగారు ఆభరణాలు అమ్మజూపారు. వీటిని పరిశీలించిన షాపు సిబ్బంది అవి బంగారు ఆభరణాలుగా భావించి ఆ ఆభరణాలకు బదులుగా వారు ఎంపిక చేసిన ఆభరణాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ లోగా మహిళలు టెస్టింగ్ కోసం ఇచ్చిన వస్తువులు మార్చి నకిలీ ఆభరణాలు వారికి ఇచ్చేశారు. వీటికి బదులుగా వారు ఎంచుకున్న 73 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకొని చెక్కేశారు. అనంతరం షాపు సిబ్బంది మరుసటి రోజు మహిళలు ఇచ్చిన వస్తువులు మళ్లీ టెస్టింగ్ చేయగా అవి పూర్తిగా నకిలీవని తెలియడంతో లబోదిబోమన్నారు. వెంటనే షాపులో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు జిల్లావ్యాప్తంగా ఉన్న బంగారం షాపు యజమానులను అప్రమత్తం చేశారు.

# నవ్య మృతిపై అనుమానాలు



పంచనామా నిర్వహిస్తున్న తహసీల్దార్ సింహాచలం తదితరులు

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్-1వ వీధిలో పొడుగు నవ్య మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం రాత్రి ఆమె అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ వై.సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు డీఎస్పీ బాలచంద్రారెడ్డి గురువారం సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతురాలి బంధువులు, భర్త సంతోష్, అత్త హేమలతతో మాట్లాడారు. అయితే తమ కుమార్తెను అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని నవ్య తల్లిదండ్రులు, అన్నదమ్ములు, ఇతర కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. భర్త సంతోష్ మాత్రం తమకేమీ తెలియదని అంటున్నారు. ఈ దశలో పోస్టుమార్టం రిపోర్టు కీలకంగా మారింది. ముందుగా చంపేసి ఆత్మహత్యగా సృష్టించేందుకు ఒంటిపై కిరోసిన్ పోసి కాల్చేశారని నవ్య కుటుంబ సభ్యులు అంటున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకూ స్థానికులతో కలివిడిగా ఉన్న అమ్మాయి అక్కడికి కొన్ని గంటల వ్యవధిలో మసి బొగ్గుగా మారి శవమైందని వారు కన్నీరు మున్నీరవుతున్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోస్టుమార్టం రిపోర్టు వస్తే నవ్య ఎలా మరణించిందనేది తెలుస్తుందని ఎస్‌ఐ సింహాచలం తెలిపారు. వరకట్న వేధింపుల కింద కేసు నమోదు కావడంతో నరసన్నపేట తహసీల్దార్ ఎ.సింహాచలం తదితరులు సమక్షంలో పంచనామా నిర్వహించారు.

# నిలిచిన పనులకు జీవం పోసేలా..

- కోడి రామ్మూర్తి స్టేడియం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి
- ఈ నెల 8న క్రీడాసంఘాలతో మంత్రి ధర్మాన సమావేశం
- క్రీడాసంఘాలు, పీడీలతోసహా క్రీడావర్గాలంతా హాజరుకావాలని ఒలింపిక్ సంఘం సూచన



కోడి రామ్మూర్తి స్టేడియం భవనం, ప్రాంగణం

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా కేంద్రంలో అర్ధంతరంగా నిలిచిపోయిన కోడి రామ్మూర్తి స్టేడియం పనుల పునఃప్రారంభంపై ప్రభుత్వం దృష్టిసారించింది. సాధ్యమైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. కేఆర్ స్టేడియం ఆధునీకీకరణ, మిగిలిన పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈనెల 4వ తేదీన రూ.12 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. గత పాలకుల శాపం, పార్టీ అనుబంధ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, నాటి క్రీడల మంత్రిగా అచ్చెన్నాయుడు కమిషన్ల రగడ తదితర కారణాలతో కోడిరామ్మూర్తి స్టేడియం పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. దీంతో దాదాపు దశాబ్దకాలంగా క్రీడాకారులు నానా అగచాట్లు, అష్టకష్టాలు పడ్డారు. ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న మైదానాల్లో నామమాత్రపు సాధనకే పరిమితమయ్యారు.

### 8న క్రీడావర్గాలతో సమీక్ష..

క్రీడాకారుల కష్టాలకు త్వరితగతిన చరమ గీతం పాడేందుకు స్వయంగా రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు రంగంలోకి దిగుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో కేఆర్ స్టేడియం ఆధునీకరణ, అభివృద్ధి పనులపై సమీక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులకు ఒక వర్తమానం చేరవేశారు. ఈనెల 8వ తేదీన ఉదయం 7 గంటలకు కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలోనే అన్ని క్రీడావర్గాలు, క్రీడాసంఘాలతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటుచేయాలని సూచించారు.

### స్వచ్ఛందంగా హాజరుకావాలి

సమీక్ష సమావేశానికి క్రీడావర్గాలంతా స్వచ్ఛందంగా హాజరుకావాలని ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన శ్రీకాకుళంలో మాట్లాడుతూ ఈ సమీక్ష సమావేశంలో క్రీడాప్రాధికార సంస్థ అధికారులతోపాటు ఒలింపిక్ సంఘ ప్రతినిధులు, వివిధ క్రీడాసంఘాల బాధ్యులు, క్రీడాభిమానులు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, క్రీడాప్రోత్సాహకులు ఇలా ప్రతిఒక్కరూ ఆదివారం ఉదయం 7 గంటలకు కేఆర్ స్టేడియం వద్దకు రావాలని ఆయన కోరారు. క్రీడా వర్గాల నుంచి తగిన అభిప్రాయాలను, సూచనలను మంత్రి పరిగణనలోకి తీసుకుని తదుపరి చేపట్టబోయే చర్యలపై నిర్ణయం తీసుకుంటారని సాంబమూర్తి పేర్కొన్నారు. సమావేశానికి ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సైతం హాజరవుతారని ఆయన వెల్లడించారు.

## క్లుప్తంగా

### సెంచూరియన్‌లో విశ్వ సముద్ర సిబ్బందికి శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన సలహాదారు రాజేంద్ర ప్రసాద్

**నెల్లిమర్ల రూరల్:** దేశంలో పోర్టులు, ప్రాజెక్టుల నిర్మాణంలో పేరు గాంచిన విశ్వ సముద్ర సంస్థ సిబ్బందికి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వ సముద్ర సంస్థ ప్రధాన సలహాదారు రాజేంద్ర ప్రసాద్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ యువత పోటీతత్వం ఎదుర్కొనేలా నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. పైలట్ ప్రాజెక్ట్ కింద సెంచూరియన్‌లో శిక్షణ ఏర్పాటు చేశామని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పల్లవి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

### సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు


కానిస్టేబుల్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

**చీపురుపల్లి:** ఢిల్లీలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఆత్మహత్యకు పాల్పడిన చీపురుపల్లి పట్టణంలోని రుంకానవీధికి చెందిన దాసరి నాగేశ్వరరావు అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. ఢిల్లీ నుంచి విమానంలో మృతదేహం బుధవారం అర్ధరాత్రి 1 గంట సమయానికి చీపురుపల్లి చేరుకోగా మృతదేహాన్ని చూసి భార్య, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు భోరున విలపించారు. దీంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనంతరం రుంకానవీధి శ్మశానవాటికలో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు మృతదేహాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తదితరులు సందర్శించి కుటుంబాన్ని ఓదార్చారు.

### మహిళకు తీవ్రగాయాలు


108లో మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

**రేగిడి:** మండలంలోని ఒప్పంగి గ్రామానికి చెందిన ఉత్తరావెల్లి పార్వతి బైక్‌పై నుంచి జారిపడి తీవ్రగాయాలపాలైంది. ఆమె రాజాం వెళ్లేందుకు గురువారం మోటార్‌సైకిల్ వెనుక కూర్చుని పయనిస్తోంది. ఆమె చీర కొంగు ద్విచక్రవాహనం వెనుక చక్రానికి చుట్టుకోవడంతో ఒప్పంగి సమీపంలో జారిపడి తీవ్ర గాయాలపాలైంది. ఈ ప్రమాదంలో ఆమె కుడి కాలు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో రేగిడి 108 ఈఎంటీ మీసాల ఈశ్వరరావు ప్రథమ చికిత్స అందించి, రాజాం ఆస్పత్రికి తరలించారు.

### మద్యం సీసాలతో వ్యక్తి పట్టివేత


మద్యం బాటిల్స్‌తో వ్యక్తిని పట్టుకున్న పోలీసు సిబ్బంది

**చీపురుపల్లి రూరల్/గరివిడి:** అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని గరివిడి పట్టణంలో ఎస్సై ఎల్. దామోదరరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పట్టుకున్నారు. పట్టణంలోని ఫేకర్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఎం.సాయిభాను అనే వ్యక్తి బుల్లెట్‌పై 50 మద్యం సీసాలు, 10 బీరు సీసాలను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించారు.

# అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు

- ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ నాగలక్ష్మి ఎస్


మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

**విజయనగరం అర్బన్:** జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులను పొందాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ కోరారు. ఎన్నో ప్రయోజనాలు కల్గించే ఈ గుర్తింపు కార్డులను సచివాలయాలు లేదా కామన్ సర్వీసు సెంటర్ నుంచి ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ శ్రమ్ పోర్టల్ ద్వారా యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎస్) కేటాయించి గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు జిల్లాలో 4,15,141 మంది అసంఘటిత రంగ కార్మికులున్నట్లు గుర్తించామని, వారంతా తక్షణమే తమ పేర్లను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రోజువారీ కూలీలు, కలాసీలు, హమాలీలు, రిక్షా కార్మికులు, మోటార్, భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసేవారు, రైతుకూలీలు, చిన్న సన్నకార రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, వీధి వ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారు, చిన్న వ్యాపారస్తులు, జాతీయ ఉపాధి హామీ కూలీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తూ గౌరవ భృతి పొందే అంగన్వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసేవారు, దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయం లేనివారు, కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారంతా ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, గుర్తింపు కార్డులను పొందవచ్చునని తెలిపారు.

**గుర్తింపు కార్డు ఉంటే ఆర్థిక సాయం**

ఈ గుర్తింపుకార్డు కలిగి ఉండి, ప్రమాదవశాత్తు మరణించినా శాశ్వత అంగవైకల్యం పొందినట్లయినా, వారికి కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షలు ఆర్థిక సాయాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ విధంగా 2022 మార్చి 31లోగా మరణించిన శాశ్వత అంగవైకల్యం పొందిన వారి దరఖాస్తులను, డీఆర్‌డీఏ పీడీ, ఉపకార్మిక కమిషనర్, డీఎంహెచ్ఓ, ఎస్పీతో కూడిన కమిటీ పరిశీలించి, వాటిని అప్‌లోడ్ చేసే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఈ-శ్రమ్ గుర్తింపు కార్డు కలిగి ఉన్న అసంఘటిత కార్మికులు రేషన్ కార్డు లేకపోయినట్లయితే వెంటనే రేషన్ కార్డును జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. దీని ప్రకారం జిల్లా పౌరసరఫరాల శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దీనికోసం గ్రామ సచివాలయాల ద్వారా రేషన్ కార్డులు లేని అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికుల వివరాలను సేకరించి, పౌరసరఫరాల శాఖలు అందజేయాలని, గ్రామ వార్డు సచివాలయాల ఇన్‌చార్జ్ అధికారిని ఆదేశించామని తెలిపారు. అలాగే ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని రేషన్ కార్డులను ఇప్పించేందుకు కృషి చేయాలని కార్మిక శాఖను ఆదేశించారు.

**పింఛన్ సదుపాయం**

ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులు కలిగి ఉన్నవారు ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ పథకం (పీఎంఎస్‌వైఎం) ద్వారా పింఛన్ సదుపాయాన్ని కూడా పొందవచ్చునని సూచించారు. బహుళ ప్రయోజనాలను కలిగించే ఈ గుర్తింపు కార్డులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఆధార్ నంబర్, ఆధార్ లింక్ అయిన సెల్ నంబర్, బ్యాంకు అకౌంట్ వివరాలను సచివాలయంలో సమర్పించి పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు కార్మిక శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్ సెంటర్‌ను సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

## 2.310 కేజీల గంజాయి పట్టివేత

**రాజాం సిటీ/సంతకవిటి:** మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామ సమీపంలో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని సంతకవిటి పోలీసులు గురువారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ముందస్తుగా అందిన సమాచారం మేరకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని జీఎంఆర్ గేటు ఎదురుగా ఉన్న టేకు తోటలో పట్టుకున్నామని ఎస్సై బుడుమూరు లోకేశ్వర రావు తెలిపారు. నిందితుడిని డోలపేట గ్రామానికి చెందిన కుప్పిలి నవీన్‌గా గుర్తించి 2.310 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

# సత్య కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు


సీతం కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ బాలికల ఎంపిక ప్రక్రియ

**విజయనగరం అర్బన్:** సత్య విద్యాసంస్థల కోసం బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ' ఎంపిక ప్రక్రియ స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగింది. ఎంపికకు సీతం, సత్య డిగ్రీ విద్యాసంస్థల బాలికలు 150 మంది పాల్గొనగా పరుగు పందెం, ఎత్తు, బరువు, మౌఖిక పరీక్ష, చేతులు, కాళ్ల కదలికల ఆధారంగా 50 మందిని ఎంపిక చేశారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపేంద్ర, సుబేదార్ మేజర్ రామదాత్, జీసీఐ సరిత పర్యవేక్షణలో ఈ ఎంపిక జరిగింది. ఎంపికైన బాలికలను సత్యా విద్యా సంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, డాక్టర్ సాయిదేవిమణి, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎన్.సత్యవేణి, లెఫ్ట్‌నెంట్ ఎం.వరలక్ష్మి ఎస్.ప్రశాంత్, సీఎస్ ఓసత్యనారాయణ, పీడీ మహేష్ పాల్గొన్నారు.

**శారీరక, సాంకేతిక సమతుల్యంపై అవగాహన**

పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'శారీరక, సాంకేతిక సమతుల్యం'పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరావు మాట్లాడుతూ శారీరిక మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని అలాగే విద్యార్థి దశ నుంచి అందరూ వ్యాయామం చేయాలని సాంకేతికతను సక్రమంగా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డీవీరామమూర్తి, మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సారా రవాణాపై దాడులు

**పార్వతీపురం టౌన్:** సారా రవాణాపై దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రా ప్రాంతానికి సారా రవాణా జరుగుతోందన్న సమాచారంతో పార్వతీపురం మండలం ములగ గ్రామ సమీపంలో మాటువేసి 80లీటర్ల సారాతోపాటు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి తాన్నవలస గ్రామానికి చెందిన మండంగి చిన్నారావును అదుపులోకి తీసుకున్నారు. అలాగే పార్వతీపురం మండలం కృష్ణపల్లి సమీపంలో 160లీటర్ల సారాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్‌చేసి మున్సిపాల్టీలోని పాతరెల్లివీధికి చెందిన రాయిపల్లి జన్నును అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై వీవీ రమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ

**పార్వతీపురం:** హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో భారత పర్యవేక్షక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సంయుక్తంగా ఈ కోర్సులకు ఉచిత శిక్షణ నిర్వహిస్తుందన్నారు. డెమీచెఫ్ దపార్టీ, రెస్టారెంట్ కెప్టెన్ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఐటీఐ ఉత్తీర్ణులై 18 నుంచి 28 ఏళ్ల లోపు గల గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తి చేసిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ హోటల్‌లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నామని వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9160912690, 9100558006 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# కాలువలో జారిపడి కారు డ్రైవర్ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు,(ఇన్‌సెట్‌లో) సుదర్శనరావు(ఫైల్)

**రేగిడి:** మండలంలోని పోరాం గ్రామ సమీపంలో గల మడ్డువలస కాలువలో జారిపడి శ్రీకాకుళం జిల్లా లోలుగు గ్రామానికి చెందిన నవిరి సుదర్శనరావు(30) గురువారం మృతిచెందాడు.పోరాం గ్రామానికి చెందిన బూరాడ విష్ణుమూర్తి కారు డ్రైవర్‌గా సుదర్శనరావు పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం విజయనగరం నుంచి పోరాం వచ్చిన సుదర్శనరావు మడ్డువలస ప్రధాన కుడికాలువలో స్నానానికి వెళ్లి, కాలువలో జారిపడ్డాడు. స్నానానికి వెళ్లిన వ్యక్తి ఎప్పటికీ రాకపోవడంతో విష్ణుమూర్తి కుటుంబసభ్యులు, స్థానికులు కాలువ వద్దకు వెళ్లి చూసి, గట్టుపై దుస్తులు, సెల్‌ఫోన్ ఉండడం గమనించారు. ఈ విషయం పోలీసులకు చేరవేయగా, ఫైర్ సిబ్బంది అక్కడికి వచ్చి తహసీల్దార్ సుదర్శనరావు ఆదేశాల మేరకు కాలువలో వెతికారు. కొద్ది దూరంలోనే సుదర్శనరావు మృతిచెంది కనిపించడంతో మృతదేహాన్ని బయటకు తీసి రేగిడి పోలీసులకు అప్పగించారు. వీఆర్ఓ ఏవీ సత్యనారాయణ శవపంచనామా నిర్వహించగా, రేగిడి పోలీసులు కేసునమోదు చేసి, రాజాం సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు సుదర్శనరావుకు ఐదునెలల క్రితమే వివాహం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మృతుడి భార్య అరుణతో పాటు బంధువులు సంఘటనా స్థలానికి వచ్చి భోరున విలపించారు.

# ప్రజల వద్దకే వైద్యసేవలు

- ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


వృద్ధురాలికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేష్‌చంద్రదేవ్

**సాలూరు:** ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యులు ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి జల్లెడ పట్టి ప్రజలకు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు చేస్తారని చెప్పారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి నయమయ్యేంతవరకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా వైద్యసిబ్బంది ప్రజల వద్దకే వచ్చి వైద్య పరీక్షలు చేస్తారని దీర్ఘరోగాలు గుర్తిస్తే ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తారన్నారు. ప్రజల ఆరోగ్య విషయంలో ముఖ్యమంత్రి రాజీలేకుండా, చికిత్స కోసం కోట్లాది రుపాయలైనా కేటాయిస్తున్నారని వివరించారు. పేదవాడికి రోగం శాపం కాకుండదని, చికిత్స కోసం ఏ పేదవాడు అప్పుల పాలు కాకూడదని ఒక్కరుపాయి కూడా ప్రజలతో ఖర్చుపెట్టనివ్వకుండా మీ సోదరుడు, మీ పెద్దకొడుకుగా బాధ్యత తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చికిత్సకు అయ్యే డబ్బంతా ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. ప్రజల కళ్లల్లో ఆనందం కోసం, ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన కోసం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఓ వైపు అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, మరోవైపు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించారని తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను, గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని పరిశీలించారు.

**వైద్యాధికారులపై అసహనం**

సుమారు 2500 మంది ప్రజలకు ఒకే వైద్యశిబిరం నిర్వహించడంపై ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మండిపడ్డారు. ఇంతమందికి ఒకే శిబిరం నిర్వహించడం ఏమిటని వైద్యాధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో తదుపరి సచివాలయాలకు సంబంధించి కనీసం మూడు ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై ఉన్నతాధికారులతో తాను మాట్లాడతానని తెలిపారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. పట్టణంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 884మందికి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, జర్జాపు ఈశ్వరరావు, గిరిరఘు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శివకుమార్, మున్సిపాలిటీ ప్రత్యేకాధికారి డీవీఈఓ మంజులవీణ, కమిషనర్ జయరాం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం

- 30 నుంచి చిత్తూరులో అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా బాల, బాలికల జట్లు


బాలుర జట్టు ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

**విజయనగరం:** విద్యార్థి దశలో క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జిల్లా స్థాయిలో ఉత్సాహ భరిత వాతావరణంలో సాగుతున్నాయి. ఈ మేరకు గురువారం అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల, బాలికల విభాగాల్లో నిర్వహించిన వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ అభ్యసిస్తున్న 300 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను జిలా జట్టులోకి ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు పీవీఎల్ఎన్ కృష్ణ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30 నుంచి చిత్తూరు జిల్లాలో జరగనున్న అండర్-19 బాల, బాలికల రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపిక పోటీలను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణంరాజు, నల్లా వెంకటనాయుడు, టీవీ భగవాన్‌దాస్, కేఏఎస్‌రాజు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

# జేఏఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి


వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

**పార్వతీపురం:** జగనన్న ఆరోగ్య సురక్ష(జేఏఎస్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ సి. విష్ణుచరణ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కౌంటర్లను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిపుణులైన వైద్యులతో ప్రజలకు అవసరమైన తనిఖీలు, పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జేఏఎస్ కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ పథకం పేదల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యసిబ్బంది రోగులకు అవసరమైన తనిఖీలు నిర్వహించారు.

# వెంకట్రామా పొల్ట్రీస్‌లో వేతన ఒప్పందం


పరిశ్రమ ఎదుట కార్మికులతో మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

**చీపురుపల్లి:** మండలంలోని కర్లాం పరిసరాల్లో ఉన్న వెంకట్రామా పౌల్ట్రీస్ పరిశ్రమలో యాజమాన్యం, కార్మికుల మధ్య వేతన ఒప్పందం జరిగింది. ఈ మేరకు గురువారం పరిశ్రమ ఎదుట సీఐటీయూ అనుబంధంతో గంగా భవాని వెంకట్రామా పౌల్ట్రీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 200 మంది కార్మికులు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎ.సన్యాశినాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ధర్నా వద్దకు చేరుకుని పరిశ్రమ యాజమాన్యం, కార్మికులతో చర్చలు జరిపారు. దీంతో ఇరువర్గాల మధ్య నూతన వేతన ఒప్పందం అమల్లోకి వచ్చినట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి టీవీ.రమణ తెలిపారు. నూతన ఒప్పందం ప్రకారం పరిశ్రమలో 200 మంది కార్మికులకు రూ.1900 నుంచి రూ.3,200 వరకు వేతనాలు పెరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధి అంబళ్ల గౌరునాయుడు, వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు గురునాయుడు, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

# జెడ్పీ చైర్మన్‌కు లోక్‌సత్తా అభినందనలు

**విజయనగరం ఫూల్‌బాగ్:** మహాకవి, ఆధునిక చరిత్రకారుడు, తెలుగు జాతికి వెలుగు చూపిన గురజాడ అప్పారావు నివసించిన గృహంపై ప్రత్యేక శ్రద్ధతో భవన నిర్వహణకు ప్రతి నెలా రూ.10 వేలు మంజూరు చేస్తూ జెడ్పీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నందుకు లోక్ సత్తాపార్టీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటోందని ఆ పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం అన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు 161 వ జయంతి సందర్భంగా లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ జిల్లా కలెక్టర్ ముందు అనేక ప్రతిపాదనలు పెట్టారని ముఖ్యంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. గురజాడ గృహం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చిన్నపాటి రేకుల షెడ్ వేస్తే సాహిత్య సభలు నిర్వహించడానికి అవకాశం ఉంటుందని, చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంటుందని, డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావును కలిసి గురజాడ గ్రంథాలయం ఆవరణలో ఉన్న గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో ప్రేక్షకులకు ఇబ్బందులు లేని విధంగా షెడ్ వేయాలని, గురజాడ ఇంటిని అధునికీకరించి టూరిజం కేంద్రంగా చేయాలని కోరారు.

సమావేశంలో పార్టీ కార్పొరేషన్ కార్యదర్శి పీఎల్ఎన్.రాజు, పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు పాల్గొన్నారు.

# గిరిపుత్రులకు తీపికబురు


వర్చువల్ విధానంలో ప్రాసెసింగ్ యూనిట్ల శిలాఫలకాన్ని, ప్రారంభించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి

- పార్వతీపురం మన్యం జిల్లాకు రెండు చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు
- రెండు యూనిట్‌లకు ఎకరాచొప్పన భూమి కేటాయింపు
- ఒక్కో యూనిట్ విలువ రూ.4.65 కోట్లు
- ఒక్కో యూనిట్ పరిధిలో 200 మందికి నేరుగా ఉపాధి
- చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీతో గిరిజనులకు ఆర్థిక ఊతం

**పార్వతీపురంటౌన్:** చిరుధాన్యాలు సాగుచేసే రైతులు, నిరుద్యోగులకు శుభవార్త. మన్యంలో పండే చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. పార్వతీపురం మండలం చందలంగి, పాలకొండ మండలం అట్టలిలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లకు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఇవి కొద్ది నెలల్లో ఏర్పాటుకానున్నాయి. వీటివల్ల చిరుధాన్యాలకు డిమాండ్ పెరుగుతుంది. సాగు లాభదాయకంగా మారుతుంది. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది. ఆరోగ్యకర ఆహారం ప్రజలకు అందుతుంది. బహుళ ప్రయోజనాల కల్పనే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**రైతులందరికీ మేలు కలిగేలా..**

పార్వతీపురం, పాలకొండలో ఏర్పాటుచేయనున్న చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లకు 50 సెంట్ల చొప్పున ప్రభుత్వం భూమి కేటాయించింది. ఒక్కో యూనిట్ విలువ రూ.4.65 కోట్లు. మొత్తం రూ.9.30 కోట్ల విలువైన యూనిట్లను నెల్లూరుకు చెందిన అజయ్‌బాబు ఇండస్ట్రీస్ ఏర్పాటుచేయనుంది. ఒక్కో యూనిట్‌లో దాదాపు 2 వందల మందికి నేరుగా ఉపాధి లభించనుంది. మరోవైపు రైతుల నుంచి గిట్టుబాటు ధరకు చిరుధాన్యాలను కొనుగోలు చేస్తారు. మిల్లెట్ పౌడర్, మిల్లెట్ మాల్ట్, మిల్లెట్ ముద్దలు, మిల్లెట్ బిస్కెట్స్, మిల్లెట్ జావ, మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ దోసెలు తదితర ఆహారపదార్థాల తయారీకి అనువైన ఉత్పత్తులను ఇక్కడ తయారు చేసి మార్కెట్ చేస్తారు.

**చిరుధాన్యాల సాగు విస్తీర్ణం ఇలా...**

పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు మండలంలో అత్యధికంగా 2,092 ఎకరాల్లోను, పాచిపెంటలో 1358, గుమ్మలక్ష్మీపురంలో 369, కురుపాంలో 50, కొమరాడలో 273, పార్వతీపురంలో 44, సీతంపేట మండలంలో 83 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతున్నాయి. ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఇందులో భాగంగా చిరుధాన్యాల సాగు, ఆహార ఉత్పత్తుల వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రజలందరికీ ఆరోగ్యకర ఆహారాన్ని అందజేసే బృహత్తర బాధ్యతను నెరవేర్చే చర్యలు చేపట్టింది.

**ఏడాదిన్నరలోపే...**

ఈ యూనిట్ల వల్ల ఒక్కోయూనిట్‌కు 200మంది చొప్పున 400 మందికి నేరుగా ఉపాధి చేకూరనుంది. స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చేలా ప్రభుత్వం చట్టం చేసింది. 18 నెలల లోపే ఈ యూనిట్లను ప్రజలకు, రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టింది.